క్లుప్తంగా

కూలీలకు బకాయిలు చెల్లించాలి



వినతి పత్రం అందిస్తున్న రైతు కూలీ నేతలు

రాపూరు: ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు సుబ్బరాయులు డిమాండ్ చేశారు. స్థానిక మండల కార్యాలయం వద్ద రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఆందోళన దిగారురు. సుబ్బరాయులు మాట్లాడుతూ పెండింగ్‌లో కూలీల బకాయిలు చెల్లించాలని, ఫీల్డ్ అసిస్టెంట్ల అక్రమ తొలగింపును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఓ దశరథరామిరెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు శంకరయ్య, లక్ష్మమ్మ, ధనమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

వేతనాల కోసం వినతి



వినతి పత్రం అందజేస్తున్న రైతు కూలీ నాయకులు

దక్కిలి: ఉపాధి హామీ పథకం కింద పని చేసిన కూలీలకు వెంటనే వేతనాలను విడుదల చేయాలని రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మండల పరిషత్ సీనియర్ సహాయకులు సిరాజ్, ఈసీ దామోదర్‌రాజుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీవీ రమణయ్య మాట్లాడుతూ ఉపాధి కూలీలకు రెండు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఆ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు నారాయణ, శంకరయ్య ఉన్నారు.

గ్రామ పంచాయతీలు శుభ్రంగా ఉంచుకోవాలి



చెత్త తరలింపును పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ

ఓజిలి: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు చెత్త సంపద కేంద్రాలను ఉపయోగించుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని మానమాల గ్రామంలో చెత్త సంపద కేంద్రం ద్వారా చెత్త తరలింపు ప్రక్రియను బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. అనంతనం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈమె వెంట ఏపీఓ చిన్నయ్య, పంచాయితీ కార్యదర్శి సుమ ఉన్నారు.

తమిళనాడుకు చేరిన అహిర్ రెజాంగ్‌లా కలశ యాత్ర



దీవీ సత్రం చేరిన రెజాంగ్ లా కలశ యాత్ర

సూళ్లూరుపేట/దొరవారిసత్రం: భారత సైన్యంలో అహిర్ రెజిమెంట్‌ను పునరుద్ధరించాలంటూ అఖిల భారత యాదవ మహా సభ చేపట్టిన రెజాంగ్‌లా కలశ యాత్ర బుధవారం మండల కేంద్రానికి చేరగా స్థానిక యాదవ సంఘం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. యాదవులు యుద్ధంలో వీర మరణం పొందిన స్థలాల వద్ద మట్టిని సేకరించి కలశంలో పెట్టి కశ్మీర్ నుంచి కన్యకుమారి వరకు యాత్ర చేస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కలశ యాత్ర దొరవారి సత్రం నుంచి సూళ్లూరుపేట నియోజకవర్గంలోని పెళ్లకూరుకు చేరుకుంది. అక్కడి నుంచి నాయుడుపేట, సూళ్లూరుపేట తడ మీదుగా తమిళనాడు సరిహద్దుల్లోని ఎలావూరు ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద తమిళనాడు యాదవ సంఘం ప్రతినిధులకు కలశాలను అందజేశారు. మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మన సోంప్రకాష్, ప్రతినిధులు డాక్టర్ మునస్వామి, మహేశ్వరి, వాసు, నాగమల్లేశ్వరి, మూర్తి, మునస్వామి, ఉమాపతి, పుష్పలత, సగిలాల రమణయ్య, ఉదయ్‌కుమార్, మునీంద్రయ్య పాల్గొన్నారు.



తమిళనాడు యాదవ ప్రముఖులకు కలశాన్ని అందిస్తున్న దృశ్యం

చికెన్ ధరలు 24.07.2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	134
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	264
లేయర్ చికెన్	:	190

ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు

పూడేరు అటవీ భూముల్లో సాగుతున్న మట్టి తవ్వకం



అక్రమ తరలింపులతో గుంతలమయంగా మారిన ప్రభుత్వ భూములు



మండలంలో పుదూరు, పూడేరు తదితర ప్రాంతాల్లోని అటవీ భూములు, చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో ఇష్టారాజ్యంగా మట్టి అక్రమ తరలింపులు రోజురోజుకూ జోరందుకుంటున్నాయి. పగలు రాత్రి తేడా లేకుండా జేసీబీ, హిటాచీ లాంటి పెద్ద యంత్రాలు పెట్టి టిప్పర్లు, ట్రాక్టర్లలో తరలించుకు పోతున్నారు. మండల పరిధిలోని పూడేరులో పెద్ద సంఖ్యలో వాహనాల ద్వారా మట్టి తరలిపోతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికార పార్టీ నేతల హుకుంతో అధికారులెవరూ అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మండల పరిధిలోని పూడేరు గ్రామంలో మట్టి తరలిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని, దానికి అడ్డుకట్ట వేసేలా చర్యలు చేపడుతున్నామని తహసీల్దార్ రాజేంద్ర తెలిపారు.

- నాయుడుపేటటౌన్

భూముల కోసం యానాదుల ఆందోళన

సైదాపురం: యానాదుల భూములను లాక్కునే ప్రయత్నాలు చేయొద్దంటూ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కల్లూరు పెంచలయ్య స్పష్టం చేశారు. యానాదుల సంక్షేమ సంఘం నేతలతో పాటు గిరిజనులతో కలిసి బుధవారం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గతంలో పని చేసిన తహసీల్దార్ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించగా తాము కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో అప్పట్లో విరమించారని గుర్తుచేశారు. మళ్లీ ఆభూములను స్వాధీనం చేసుకునే చర్యలు తక్షణమే విరమించుకోవాలని వారు తహసీల్దార్‌ను కోరారు. గిరిజనులైన తాము సాగు



నిరసన చేస్తున్న గిరిజన సంఘం నేతలు

చేసుకుంటున్న భూముల జోలికి వస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు తహసీల్దార్ సుభద్రకు వివరించారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా అధ్యక్షులు చెంచు మల్లికార్జున, మహిళ అధ్యక్షురాలు చెంబేటి ఉష, నేతలు మల్లి, నాగరాజు, కోలా రమేష్, ఏకోలు శ్రీనివాసులు, అనంతయ్య, వెంకటేష్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఏకోలు వెంకటయ్య తదితరులున్నారు.

నరాల సమస్యలపై అవగాహన అవసరం

గూడూరురూరల్ : నరాల సమస్యలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సంఘమిత్ర తెలిపారు. గూడూరులోని డాక్టర్ సి.ఆర్.రెడ్డి ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల భవనంలో బుధవారం గూడూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డయాబెటిస్ వైద్యులు జగదీష్ , గైనకలజిస్ట్ డాక్టర్ మోహన్ సాయిరూప షుగర్ వ్యాధి, గైనకాలజీ సమస్యలపై అవగాహన కల్పించారు. క్యాంప్ ఛైర్మన్ లయన్ షేక్ రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి రెండు నెలలకోసారి పేదల కోసం ఇలాంటి మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ సంఘమిత్ర

లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అక్కన రమణయ్య, డాక్టర్ చంద్రహాస్, మదనమేటి రమణయ్య, మురళీరెడ్డి, శీనయ్య, సోమిశెట్టి చెంచురామయ్య, రూపేష్‌రెడ్డి,రవిచంద్ర, వీరేంద్రనాథ్, రజనీకాంత్‌రెడ్డి, డాక్టర్ సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సత్కారం

చిల్లకూరు : విద్యార్థుల భవితకు మార్గనిర్దేశం చేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. మండలంలోని తీర ప్రాంతంలో ఉన్న చింతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఐదేళ్లుగా పని చేస్తున్న 8 మంది ఉపాధ్యాయులు ఇటీవల బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇన్ని సంవత్సరాలుగా తమకు విద్యాబోధన చేసి, ఆత్మీయ అనుబంధాన్ని ఏర్పరుచుకున్న ఉపాధ్యాయులను సత్కరించాలని విద్యార్థులు, హెచ్‌ఎం సుబ్రహ్మణ్యంను కోరారు. దీంతో ఆయన బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాలకు పిలిపించి ఘనంగా సత్కరించారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యార్థులు

కార్యక్రమంలో ఉపాధ్యాయులు పెంచలయ్య, రమణయ్య, శ్రీనివాసులు, శారద, అరవింద, భాస్కరరావు, రమేష్, మెహర్‌తాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

చిల్లకూరు: జాతీయ రహదారిపై చిల్లకూరు సమీపంలో ప్రమాదాలు జరుగుతున్నా బూదనం సమీపంలో ఉన్న స్వర్ణా టోల్ ప్లాజా నిర్వాహకులు కనీసం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం చిల్లకూరు ఓవర్ బ్రిడ్జి సమీపంలో వరగలి క్రాస్‌రోడ్డు నుంచి నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో మట్టి తరలిస్తున్న టిప్పర్‌కు ప్రమాదం జరిగి ఆ ప్రాంతంలో రోడ్డుపై మట్టి పడి పోయింది. అప్పటి నుంచి చిరు జల్లులు కురిసినా ద్విచక్రవాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురవుతున్నాయి. టోల్ ఫీజులు



జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గ్రావెల్

ముక్కు పిండి వసూలు చేసే టోల్‌ప్లాజా నిర్వాహకులు రహదారి భద్రత ప్రమాణాలను మాత్రం గాలికొదిలేశారు.

కలువాయిలో పడకేసిన పారిశుధ్యం

కలువాయి(సైదాపురం): మేజర్ పంచాయతీ అయిన కలువాయిలో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారుల వెంబడి చెత్త చెదారాలతో దర్శనమిస్తున్నాయి. గ్రీన్ అంబాసిడర్లు పేరుకే ఉన్నారు తప్ప వారు పనులు చేయడం లేదనే విమర్శలు గుప్పుమంటున్నాయి. పంచాయతీల్లో రెండు ట్రాక్టర్లు, రెండు ఆటోలు, రిక్షాలు ఉన్నా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరిపై సక్రమమైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే చెత్త పేరుకుపోతోందని స్థానికులు చెబుతున్నారు.



ఉన్నత పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్త

కత్తితో దాడి.. ఒకరికి గాయాలు

దొరవారిసత్రం: ఇంటి స్థలం విషయమై ఇరు వర్గాల నడుమ వివాదం తలెత్తడంతో ఒకరు కత్తితో దాడి చేసిన ఘటనలో ప్రత్యర్థి చింతపూడి కుమార్(28) తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం తల్లంపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. తల్లంపాడు ఎస్సీ కాలనీకి చెందిన చింతపూడి కుమార్, అదే కాలనీకి చెందిన ఉమామహేష్ మధ్య రెండు రోజులుగా ఇంటి స్థలం విషయంలో వివాదం తలెత్తి ఇరువురు గొడవపడుతున్నారు. బుధవారం ఈ వివాదం ఘర్షణకు దారితీయడంతో ఉమామహేష్ కత్తితో కుమార్‌పై కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. గాయపడిన అతన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. కత్తితో దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

స్కార్పియో కారు దగ్ధం

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై వెళుతున్న స్కార్పియో కారు నుంచి పొగలు వచ్చి ఒక్కసారిగా దగ్ధం అయిన ఘటన బుధవారం రాత్రి ఎస్‌ఎం అగ్రహారం గ్రామం వద్ద చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. నాయుడుపేట పట్టణ ప్రాంతంలోని పిచ్చిరెడ్డితోపు ప్రాంతానికి చెందిన విజయ్‌భాస్కర్‌రెడ్డి స్కార్పియో కారులో సూళ్లూరుపేట మండలం గుమ్మిడితాగేళి గ్రామానికి వెళ్లి తిరిగి నాయుడుపేటకు వస్తున్న సమయంలో కారులో పొగలు రావడంతో ఎస్‌ఎం అగ్రహారం వద్ద రోడ్డు పక్కన కారును నిలిపి దిగేశాడు. కారులో ఒక్కసారిగా మంటలు పెద్దఎత్తున మంటలు వచ్చి కారు పూర్తిగా దగ్ధం అయ్యింది.



ఎస్‌ఎం అగ్రహారం వద్ద కాలిపోతున్న స్కార్పియో

సూళ్లూరుపేట అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. స్థానిక పోలీసులు పోలీసుల ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

గూడూరురూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు బూదూరు గురవయ్య పేర్కొన్నారు. గూడూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఎంపీపీ గురవయ్య అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సర్పంచ్‌లకు అధికారులు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని, అభివృద్ధి పనుల కోసం ఫోన్ చేస్తే మాట్లాడలేని స్థితిలో ఉన్నారని మండిపడ్డారు. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఎరువులు, విత్తనాలు, సిబ్బంది కొరత లేకుండా చూడాలని చెప్పారు. మండల పరిషత్ నిధులతో కొండాగుంట దళితవాడకు 2 బోర్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. విద్యుత్ కోతలు ఎక్కువగా ఉన్నాయని, రైతులు, ప్రజలు అల్లాడిపోతున్నారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బూదూరు గురవయ్య

శాఖల వారీగా సమీక్షించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ ఊటుకూరు యామిని, వైస్ ఎంపీపీ-2 ఇంద్రాణి, డిప్యూటీ ఎంపీడీఓ మోహన్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్వతీ దేవికి ఆషాఢం సారె



పార్వతీదేవికి సమర్పించిన ఆషాఢం సారె, అమ్మవారికి సారె తీసుకువెళుతున్న భక్తులు

రాపూరు: మండల కేంద్రంలోని పురాతన ఆలయమైన రామనాథేశ్వరస్వామి ఆలయంలో వెలసిన పార్వతీదేవికి సమర సత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఆషాఢం సారే అందించారు. ముందుగా స్థానిక వరసిద్ధివినాయక ఆలయం నుంచి మహిళా భక్తులందరూ వస్త్రాలు, వడిబాల బియ్యం, పసుపు, కుంకుమ, కొబ్బరి, ఖర్జూరం తదితర సారె సామగ్రితో శోభాయాత్రగా వెళ్లి శివాలయంలోని పార్వతిదేవికి సమర్పించారు. ఫౌండేషన్ నిర్వాహకులు భాస్కర్, రాఘవరెడ్డి, మారుతీరావు, గణపతి, ఆనంద్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వెంకటగిరి రూరల్ : ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివి రమణయ్య పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట బుధవారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉపాధి హామీని నీరు గారుస్తోందని తెలిపారు. ఈ మేరకు ఉపాధి కూలీలకు రెండు నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం ఏపీఓకు



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు కూలీ సంఘం నేతలు

వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు జే భాస్కర్ పాల్గొన్నారు.

పచ్చిరొట్టపై అవగాహన

వాకాడు: మండలంలోని కొండాపురం, కాశీపురం గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ ఏడీ నాగార్జున్ సాగర్ పాల్గొని రైతులకు పంటల బీమా, ఈ-పంట, పచ్చిరొట్ట విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతు సేవా కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.



అవగాహన కల్పిస్తున్న ఏడీ నాగార్జునసాగర్

ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి ఆర్నూరి దీప, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కండలేరులో 28 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 28.098 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2000, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 100, హైలెవల్ కాలువకు 10, మొదటిబ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడిపై దాడి

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఓ పానీ పూరి దుకాణం వద్ద మంగళవారం రాత్రి ఓ యువకుడిపై దాడి జరిగింది. పట్టణానికి చెందిన రాకేష్ అనే యువకుడు తన స్నేహితుడితో కలసి పానీ పూరి తింటున్నాడు. అదే సమయంలో అక్కడికి సాయితేజ, ఆలీ అనే యువకులు ఇద్దరు వచ్చి రాకేష్‌ను ఏమిరా బాగున్నావా? అని అన్నారు. దీంతో రాకేష్ ఆలీని తనకన్నా చిన్నవాడివి రే అని పిలవడం ఏమిటని ప్రశ్నించాడు. దీంతో సాయితేజ అనే యువకుడు కలుగజేసుకుని తాను ఇప్పటికే ఒకరిని లేపిసి ఉన్నా అనుకుంటే నిన్ను కూడా లేపేస్తా అంటూ బెదిరించాడు. దీంతో రాకేష్ ఎందుకు అలా మాట్లాడుతున్నారని ప్రశ్నించే సరికే ఆలీతో పాటుగా సాయితేజ ఇద్దరు కలసి అతనిపై దాడికి పాల్పడ్డారు. పక్కనే ఉన్న బేకరిలో పని చేసే యువకులు వచ్చి కలగజేసుకున్నా వారిపై దాడికి దిగారు. ఈ క్రమంలో రాకేష్ గాయపడడంతో ఆలీ, సాయితేజ అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో రాకేష్ గూడూరు ప్రభుత్వాస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సీసీ పుటేజ్‌లో రికార్డయిన దాడి దృశ్యం

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం

వాకాడు: మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ పేరుతో రీ కాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాజకీయ విశ్లేషకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కొడవలూరు దామోదర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మాట్లాడుతూ బాలకృష్ణారెడ్డి సేవా క్షేత్ర ఆవరణలో పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరుకానున్నట్లు వివరించారు.

దక్కిలిలో ...

దక్కిలి: మండల కేంద్రంలో గురువారం మధ్యాహ్నం బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతల శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు.

డప్పు కళాకారునికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న పండరి భజన గురువులు

చిల్లకూరు : గూడూరు మండలం విందూరు గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు ఇటీవల ప్రమాదవశాత్తు తన కాలు పోగొట్టుకుని మంచానికే పరిమితం అయ్యాడు. తన దీన స్థితిని అర్థం చేసుకున్న ఉమ్మడి నెల్లూరు జిల్లా పండరి భజనల గురువులు సుమారు 50 మంది డప్పు కళాకారునికి అతని ఇంటి వద్దకు చేరుకుని బుధవారం తమ వంతు సాయంగా రూ.1.25 లక్షలు అందజేశారు. కార్యక్రమంలో టీవీ క్రిష్ణదాసు, పెంచలదాసు, పెంచల్‌రెడ్డి, యానాదయ్య, ప్రభాకర్, మురళీ, శ్రీకాంత్, ఉపాధ్యాయుడు శీనయ్య పాల్గొన్నారు.

తాళ్లమ్మ కొలుపు రేపు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామ దేవత తాళ్లమ్మతల్లి కొలుపు మహోత్సవం ఈ నెల 25వ తేదీ శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. అమ్మవారి ఆలయంలో రెండు రోజుల నుంచి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు.

బాలికలకు వైద్య పరీక్షలు

కోట: స్థానిక బాలసదన్‌లో బుధవారం తిరుపతి రుయా హాస్పిటల్ ఆధ్వర్యంలో బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్లు గుణశేఖర్, ప్రభుకిరణ్, ప్రత్యూష పాల్గొని బాలసదన్‌లో ఉన్న బాలికలకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. అనారోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ మునికుమారి పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికపై శిక్షణ

తడ: సమగ్ర ప్రణాళికపై ఒక్కరోజు శిక్షణా తరగతులను బుధవారం మండల కేంద్రంలో నిర్వహించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో వెలుగు ఏపీఎం రాజారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్ నాయక్ మాట్లాడారు. అభివృద్ధి, సాంఘిక అంశాలపై అవసరాలను గుర్తించి ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో సీసీలు జనార్దన్, మురళి, అకౌంటెంట్ సుగుణ, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సుగుణ, నాగమణి, గ్రామ సంఘం అధ్యక్షులు, సహాయకులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు తిలక్

చిల్లకూరు : స్వాతంత్ర్య పోరాట యోధుడు బాలగంగాధర్ తిలక్ పోరాట యోధుడని భారతీయ విచక్షణా మండలి సభ్యులు ప్రజేంద్రరెడ్డి తెలిపారు. మండలంలోని పారిచెర్లవారిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలగంగాధర్ తిలక్ 170వ జయంతిని పురస్కరించుకుని ఆయన గొప్పతనాన్ని తెలియజేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనసూయ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్, కామేశ్వరి, మధుసూదన్‌రావు, విద్యుల్లత, సంధ్య, రమణయ్య పాల్గొన్నారు.

బాబు మోసపూరిత పాలన



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మేరిగ మురళీధర్, నాయకులు

చిట్టమూరు : రాష్ట్రంలో చంద్రబాబు మోపూరిత పాలన సాగిస్తూ అన్ని వర్గాల ప్రజలను ముంచేశారని ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేరిగ మురళీధర్ అన్నారు. మండల పరిధిలోని గునపాటిపాళెంలో పార్టీ నేత మారంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నివాసంలో బుధవారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆచరణకు అమలు కాని హామీలు ప్రజలకు ఇచ్చి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత అవి ప్రజలకు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఆడబిడ్డలకు ఇచ్చే స్త్రీనిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాలని మంత్రి చులకనగా మాట్లాడుతున్నారని చెప్పారు. జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను సంవత్సరంలోనే 90 శాతానికిపైగా అమలు చేసి దేశంలోనే చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా ఇచ్చిన ఏ హామీ పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. గ్రామాల్లో ప్రజలకు చంద్రబాబు చేసిన మోసం అర్థమయిందని, అందుకే అన్ని వర్గాల ప్రజలు జగనన్నే ముద్దు-చంద్రబాబు వద్దు అంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రతి ఒక్కరం ప్రజల్లోకి తీసుకెళ్లి తెలియజేయాలన్నారు. అనంతరం బాబు షూరిటీ- మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులు రెడ్డి, పార్టీ నేతలు కామిరెడ్డి కస్తూర్ రెడ్డి, పేట రాజీవ్‌రామిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు చిప్పల వెంకటయ్య, వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య, రవీంద్రరెడ్డి, చెన్నారెడ్డి బాబు రెడ్డి, రఘునాథరెడ్డి, సుధీర్ రెడ్డి, లోకేష్ రెడ్డి, రమేష్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, కోదండరామిరెడ్డి, విజయులురెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, సుకుమార్ రెడ్డి, వంకా చెంచయ్య, పకీరయ్య, అనీల్ రెడ్డి, గిరిరెడ్డి, రాధారెడ్డి, ఆశమధు, నాగముంతల సుబ్బయ్య, గునపాటిపాళెం సర్పంచ్ పోలయ్య, బిరియానీ మస్తాన్, కుమార్, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.